ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శనివారం | 15 మార్చి 2025 | ■ 10 పేజీలు


# ఉమ్మడి జిల్లాలో 'మంచు'టెండ

## ఈసారి దంచి కొట్టనున్న భానుడు



- ఉదయం పొగ మంచు.. మధ్యాహ్నం దారెత్తిస్తున్న ఎండ
- కొన్నిచోట్ల వడగాడ్పుల ప్రభావం
- వేసవి ప్రారంభంలోనే ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- 40డిగ్రీలపైగానే నమోదు కానున్న ఎండలు
- సమతుల ఆహారమే శ్రీరామరక్ష
- వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



## వర్ణాల వానలో..

# జాలీగా.. 'హోలీ'గా..

■ అంబరాన్నంటిన హోలీ సంబురాలు ■ సప్తవర్ణ శోభితమైన నాలుగు జిల్లాలు..

■ బైక్‌లపై యువత కేరింతలు ■ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ■ మరి కొన్ని చోట్ల నేడు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు అన్నివర్గాల తీరొక్క రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల శంకర్ వేడుకల్లో పాల్గొన్నారు. నిర్మల్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్ కుటుంబసభ్యులతో కలిసి హోలీ పండుగను జరుపుకున్నారు. మంచిర్యాల కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ వేడుకల్లో పాల్గొన్నారు.

2




# 'కృతిమ మేధ'తో బోధన

■ ఒక్కో పాఠశాలలో 10మంది విద్యార్థులకు బోధన ■ కనీస సామర్థ్యాల పెంపే లక్ష్యం

■ నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక తరగతులు ■ అధికారికంగా ప్రారంభించనున్న కలెక్టర్లు..

సర్కారు బడుల్లో ప్రాథమిక విద్యను బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. పలు పాఠశాలల్లో 'కృత్రిమ మేధ' సాయంతో విద్యార్థులను ఆకట్టుకునేలా, సులభ రీతిలో బోధనను నేటి నుంచి చేపట్టనున్నారు. ఆయా పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కార్యాచరణ సిద్ధం చేసింది. 3,4,5వ తరగతి విద్యార్థులు తెలుగు బాగా చదివేలా, గణిత అంశాల్లో పట్టు సాధించేలా చూడటమే ఈ కార్యక్రమం లక్ష్యం. 'కృత్రిమ మేధ' (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో ఆకట్టుకునేలా పాఠ్యాంశాలు బోధిస్తారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు సంబంధిత పాఠశాలల్లో పూర్తయ్యాయి. నేడు జిల్లా కలెక్టర్లు, అధికారులు ప్రారంభించనున్నారు.

పోలీస్ లాంఛనాలతో
## హంటర్‌కు అంత్యక్రియలు

- పోలీసు శాఖకు విశేష సేవలందించిన జాగిలం
- అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అనారోగ్యంతో మృతి
- నివాళులర్పించిన ఎస్పీ జానకి షర్మిల, అధికారులు



10లో

## విజయవంతంగా గిరిజన క్యాంటీన్



- గిరిజన క్యాంటీన్ ప్రారంభించి నేటితో సంవత్సరం పూర్తి..
- ఐటిడిఏ పీఓ ఖుష్బూ గుప్తా

# పండగపూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో యువకుడు
- ప్రాణహిత నదిలో మునిగి మరొకరు మృతి
- ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలో విషాద ఛాయలు

వివరాలు 5లో





హోలీ పండగపూట విషాదం నెలకొంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఆదిలాబాద్ పట్టణం కొత్తకుమ్మరివాడకు చెందిన జిల్లేడే రిషి కుమార్ (16) అనే యువకుడు హోలీ వేడుకల్లో పాల్గొని వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంచిర్యాల జిల్లా వేమనపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్(19) అనే యువకుడు ప్రాణహితలో స్నానానికి వెళ్లి మునిగి దుర్మరణం పాలయ్యాడు.






# 'కృత్రిమ మేధ'తో బోధన

- ఒక్కో పాఠశాలలో 10మంది విద్యార్థులకు బోధన
- కనీస సామర్థ్యాల పెంపే లక్ష్యం
- నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక తరగతులు
- అధికారికంగా ప్రారంభించనున్న కలెక్టర్లు..



**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచేందుందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందు కోసం ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్(ఏఐ) టెక్నాలజీ సాయం తీసుకునేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొదటి విడతలో నాలుగు ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ పాఠాలు బోధించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే విద్యాశాఖ 1 నుంచి ఐదో తరగతి వరకు ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం అమలు చేస్తోంది. ఉపాధ్యాయులకు శిక్షణ అందించడంతోపాటు టీచింగ్, లర్నింగ్, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, హ్యాండ్ బుక్స్ ముద్రించి సరఫరా చేస్తున్నారు. ఏఐ టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ ఏఐ ద్వారా ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం మరింత మెరుగ్గా అమలు చేయనున్నారు.

**నేటి నుంచి ప్రారంభం..**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏఐ వినియోగం పెరిగింది. అన్నిరంగాల్లో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హవా నడుస్తోంది. ఈ సాంకేతికత సాయంతో ప్రాథమిక విద్య మరింత బలోపేతం కానుంది. పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని నాలుగు ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. శనివారం నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లో ఏఐ కార్యక్రమాలు చేపట్టనున్నారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రేతోపాటు అదనపు కలెక్టర్లు, అధికారులు ఆయా పాఠశాలల్లో ఏఐ బోధనను అధికారికంగా ప్రారంభించనున్నారు.

**పది మంది విద్యార్థులు ఎంపిక..**

ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు ఆశించిన స్థాయిలో అభ్యనన సామర్థ్యాలు, చతుర్విద ప్రక్రియల్లో వెనుకబడుతున్నారు. ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నా ఫలితాలు మెరుగుపడడం లేదు. ఈ నేపథ్యంలో 3,4,5 తరగతుల విద్యార్థుల్లో సీ గ్రేడ్ ఉన్న సామార్థ్యాలను మెరుగుపర్చడం కోసం చర్యలు చేపట్టారు. జిల్లాలోని తక్కెళ్లపల్లి, గోయగాం, ఖిరిడి, సలుగుపల్లి ప్రాథమిక పాఠశాలల నుంచి పది మంది చొప్పున విద్యార్థులను ఎంపిక చేశారు. ఆయా స్కూళ్లలో వెనుకబడిన విద్యార్థులను ఏఐ పాఠాల కోసం సంసిద్ధం చేశారు. ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులు సమీప ఉన్నత పాఠశాలల్లోని కంప్యూటర్లను వినియోగించనున్నారు.

**బోధన ఇలా..**

ప్రత్యేక సాఫ్ట్వేర్ ద్వారా పిల్లలను ఆకట్టుకునేలా అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధన సాగనుంది. 3, 4, 5 తరగతుల నుంచి ఎంపిక చేసిన విద్యార్థుల నుంచి ఐదుగురి చొప్పున ఒక బ్యాచ్ను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో బ్యాచ్కు తెలుగువాచకం, గణితం అభ్యాసాలపై 20 నిమిశాల వ్యవధిలో ఏఐ పాఠాలు బోధించనున్నారు. సదరు విద్యార్థి పాఠ్యాంశం అర్థం చేసుకుంటున్నాడా..? లేదా అని గుర్తించి.. అర్థం కాకుంటే సరైన మార్గంలో బోధన సాగిస్తుంది. ప్రతీ విద్యార్థి అభ్యసన సామార్థ్యాలు మదింపు చేయడంతోపాటు గతంతో పోలిస్తే పురోగతి ఎలా ఉందో పరిశీలించి నివేదిక రూపొందించనున్నారు. వారంలో నాలుగు రోజులు ఏఐ పాఠాల బోధన సాగనుంది. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల పెంపు నకు ప్రస్తుతం ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమల్లో ఉంది. మరింత మెరుగైన సామర్థ్యాలు సాధించేందుకు అర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను వినియోగించుకోవాలని ప్రభు త్వం నిర్ణయించింది.

**ఆదిలాబాద్ జిల్లాలో...**

తలమడుగు మండలం దేవాపూర్ ప్రైమరీ స్కూల్ తెలుగు, ఉర్దూ మీడియంలో, కోడద్ ప్రైమరీ స్కూల్లో, అదిలాబాద్ అర్బన్ తాటిగూడ ప్రైమరీ స్కూల్లో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా బోధన రేపటి నుండి ప్రారంభించడం జరుగుతుందని, సమగ్ర శిక్ష తెలంగాణ విద్యాశాఖ మౌళిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమంలో కృత్రిమ మేధను ఉపయోగించి బోధనను మెరుగుపరచడానికి ఫౌండేషన్ సహకారంతో పైలెట్ ప్రాజెక్టు గా జిల్లాలో 9 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించడం జరిగిందనీ, మొదటగా ఈనెల 15 రేపు శనివారం 4 ప్రైమరీ పాఠశాలలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని గూగుల్ మీట్ ద్వారా పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఒక క్వాలిటీ కంట్రోలర్, ఒక మండల విద్యాశాఖాధికారి, ఒక పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు, ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జిల్లా నుండి నలుగురికి ఇదివరకే రాష్ట్ర స్థాయిలో శిక్షణ తీసుకున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయిలో భాషలో అభ్యసన సామర్థ్యాలు, అలాగే గణితంలో చతుర్విధ ప్రక్రియల్లో వెనకబాటు లోనే ఉంటున్నారని, ఈ క్రమంలో కృత్రిమ మేధ సాయంతో ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానంగా 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో మెరుగైన అభ్యసన సామర్థ్యాలను సాధించడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఆయా ప్రైమరీ పాఠశాలలో చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి, వారి వివరాలను రిజిష్టర్లో నమోదు చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. ప్రతీ పాఠశాలలో 5 కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని విండోస్ 10 తప్పనిసరిగా ఇన్ స్టాల్ చేసుకోవాలనీ ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. గూగుల్ మీట్లో విద్యా ధికారి ప్రణీత, మనోహర్, వెంకట్రావ్, క్వాలిటీ కో- ఆర్డినేటర్ శ్రీకాంత్, లీడీఎం తదితరులు ఉన్నారు.

---

## మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**జన్నారం, మార్చి 14 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీమంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టి బొమ్మను జన్నారం మండల కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జన్నారం మండల అధ్యక్షుడు, ముజాఫర్ అలీ ఖాన్ మాట్లాడుతూ.. అసెంబ్లీ స్పీకర్ దళితుడు అయినందునే ఉన్నతవర్గాల ఎమ్మెల్యేలు అతని పోడియంపై విరుచుకుపడి అగౌరవపర్చడం సరికాదన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సభా మర్యాదలు పాటించకుండా స్పీకర్ను ఎమ్మెల్యేలను అనుచితంగా మాట్లాడడం సరికాదన్నారు. వెంటనే జగదీశ్వర్ రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ మచ్చ శంకయ్య, నాయకులు రాజశేఖర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సతీష్, దాముఖ కరుణాకర్, మామిడిపెల్లి ఇందయ్యా దూమల్ల రమేష్, గంగన్న అజారుద్దీన్, డైరెక్టర్ తిరుపతి, ప్రశాంత్, కానేశ్వర్ నందు నాయక్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ఖానాపూర్లో కాంగ్రెస్ నాయకులు మాజీమంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. వెంటనే స్పీకర్ను క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

---

## కెఎన్ఆర్ ట్రస్టు సేవలు అభినందనీయం



**సారంగాపూర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**

కెఎన్ఆర్ ట్రస్టు సేవలు అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ, దశరథ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య లు అన్నారు. మండలంలోని జామ్ గ్రామానికి చెందిన కోర్వ నవీన్ రెడ్డి న్యాయవాది నెలకొల్పిన కొర్వ నవీన్ రామ క్రిష్ణ రెడ్డి ట్రస్ట్ (కెఎన్ఆర్) జాం/హైదరాబాద్ గార్ల ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంతోపాటు కౌట్ల(బి),మలక్ చించోలి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు,ఇంగ్లీష్ డీ క్షణరీ లు పరీక్ష సామాగ్రి అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడారు..సమాజ భాగస్వామ్యంతో పాఠశాలలు ప్రగతి బాట పడతాయని అన్నారు.కాంగ్రెస్ నాయకులు కోర్వ నవీన్ రెడ్డి న్యాయవాది కెఎన్ఆర్ ట్రస్టు అందించిన సహకారాన్ని అందిపుచ్చుకొని ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను శ్రద్ధగా చదివి పది పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల తరుపున కెఎన్ఆర్ ట్రస్టు సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒలత్రి నారాయణ రెడ్డి,జగదీష్, లక్ష్మన్, సత్యం, భోజన్న, రమేష్, పోత రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

---

## ఎంజేపీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**లక్షెట్టిపేట, మార్చి 14 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 6,7,8,9 తరగతుల్లో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి ఎంజేపీ బ్యాక్ లాగ్ సెట్ నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ శుక్రవారం తెలిపారు. అర్హులైన విద్యార్థినీ విద్యార్థులు ఆన్లైన్ ద్వారా కానీ లేదా సమీప మీ సేవ కేంద్రాల ద్వారా కానీ దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 31 చివరి తేదీ కాగా ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు బోనఫైడ్, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫొటో, సంతకం, ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీ, కుల మరియు ఆదాయ ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. చివరి రోజు వరకు నిరీక్షించకుండా తల్లిదండ్రులు తక్షణమే స్పందించి సకాలంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా



సూచించారు. ప్రవేశ పరీక్షకి సంబంధించిన హాల్ టికెట్లను ఏప్రిల్ 15వ తేదీ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని, మరింత సమాచారం కోసం వెబ్సైట్ https://mjptbcwreis.telangana.gov.inలో కానీ లేదా 040-23328266 ని సంప్రదించాలన్నారు.

---




## సీఎం దిష్టిబొమ్మ దహనం

**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం ఎదుట సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జగదీశ్వర్ రెడ్డిని ఉద్దేశపూర్వకంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షు డు అలాల్ అజయ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విజగిరి నారాయణ, మాజీ కౌన్సిలర్లు గణేశ్, దమ్మాపాల్, అశోక్ స్వామి, మెట్టు ప్రహ్లాద్, గోవర్ధన్, తిరుపతి పాల్గొన్నారు.

**బెల్లంపల్లిలో..**

**బెల్లంపల్లి, మార్చి 14 (ప్రభాత సమాచారం)**

ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం పట్ల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు పట్టణంలోని కాంట్రా చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సబ్బని అరుణ్ కుమార్ పాల్గొన్నారు.





# సమగ్ర అభివృద్ధికి ఆదర్శంగా నిలిచిన నార్నూర్

**- పీఎం అవార్డ్-2025 కోసం - నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ)కి ఎంపిక**
**- 426 ఆస్పిరేషనల్ బ్లాక్స్ టాప్ 30లో నార్నూర్**

**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల్లో నార్నూర్ మండలం మొదటి స్థానంలో ఉండేది. ఇక్కడి ఆదివాసీ గిరిజనుల జీవనాధారం వ్యవసాయం కాగా మౌలిక వసతుల లేమి, పరిమిత జీవనోపాధి అవకాశాలతో వెనుకబడి ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. నేడు ఈ మండలం నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ) కింద ఒక సమగ్ర అభివృద్ధి మోడల్గా నిలుస్తోంది. ఈ మార్పు ఒక్కరోజులో దక్కింది కాదు.. పలు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, సీఎస్ఆర్ భాగస్వామ్యాల సమష్టి కృషి ఫలితం. జనవరి 7, 2023న నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ) కింద నార్నూర్ ఎంపికై పొంది. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధి, ఆర్థిక సమగ్రత వంటి కీలక రంగాల్లో పనితీరు మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జూన్ 2023 నాటికి దక్షిణ భారతదేశంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకుంది. డెల్టా ర్యాంకింగ్లో ఇది గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. దీనికి గుర్తింపుగా నార్నూర్ బ్లాక్కు రూ.కోటి ప్రోత్సాహక నిధి మంజూరైంది. ఇది అభివృద్ధి లక్ష్యాల సాధనలో స్ఫూర్తిదాయక ఘట్టం. అంతే కాదు.. పీఎం అవార్డ్స్ 2024 కోసం 426 ఆస్పిరేషనల్ బ్లాక్స్ టాప్ 30లో ఒకటిగా నార్నూర్ ఎంపికైంది.

## పొలంలో విద్యుత్ ఉచ్చులకు వేటగాడి బలి

**రెబ్బెన, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
అడవి జంతువులను వేటాడేందుకు పొలంలో విద్యుత్ తీగలకు ఉచ్చు బిగుస్తుండగా వేటగాడు బలయ్యాడు. మండలంలోని నారాయణపూర్లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీకి చెందిన పొల్క రమేశ్ (45) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. అప్పుడప్పుడు అడవి జంతువులను వేటాడేవాడు. గురువారం రాత్రి బయటకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయల్దేరాడు. గ్రామానికి చెందిన గోలెం పెంటయ్య వ్యవసాయ పొలంలో అడవి జంతువులను వేటాడేందుకు విద్యుత్ వైర్లు అమర్చాడు. విద్యుత్ సరఫరా అందించే క్రమంలో వైరు తగిలి షాక్ గురై అక్కడిక్కడే మృతిచెందాడు. తెల్లవారిన తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. పొలంలో ఎవరో పడిపోయి ఉన్నాడని గ్రామస్తుడు తోట నవీన్.. రమేశ్ కుమారుడికి తెలిపాడు. అక్కడికి వెళ్లి చూడగా రమేశ్ పడిపోయి ఘటన స్థలంలో ఒంటిపై కరెంట్ తీగ చుట్టుకుని ఎడమ చేతిలో పట్టుకుని, కుడి చేతిలో కర్ర ఉన్నట్లు గుర్తించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ బుద్దెస్వామి, ఎస్సైచంద్రశేఖర్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు సాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



## బందోబస్తును పరిశీలించిన ఆదిలాబాద్ ఎస్పీ

**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
హోలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తమై ఉంటూ విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్ర జలంతా ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలని సూచించారు. పట్టణంలోని వినాయక చౌక్, అబ్దుల్లా చౌక్, గాంధీ చౌక్ అంబేద్కర్ చౌక్, శివాజీ చౌక్ ప్రాంతాలను పరిశీలించి ట్రాఫిక్ సమస్యను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే అందరి



సహకారంతో శాశ్వత పరిష్కారం దిశగా చొరవచూపనున్నట్లు తెలిపారు. డీఎస్పీలు ఎల్.జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, సీఐలు సునీల్, శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఉన్నారు.

## వంద కిలోల నకిలీ పత్తి విత్తనాల సీజ్



**మంచిర్యాల, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
నకిలీ పత్తి విత్తనాల రవాణాపై మంచిర్యాల టాస్క్ ఫోర్స్ పోలీసులు పంజా విసిరారు. శుక్రవారం రైలు మార్గం ద్వారా తీసుకువస్తున్న వంద కిలోల నకిలీ పత్తి విత్తనాలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని రవాణా చేస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి మంచిర్యాలకు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఖరీఫ్ సీజన్ కు ముందే నకిలీ విత్తనాలను తీసుకువచ్చి స్టాక్ పెట్టుకునేలా వ్యాపారులు పన్నాగం పన్నుతున్నారు. ఇది గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఎస్సై ఉపేందర్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు. నకిలీ విత్తనాలు జిల్లాకు చేరుకుంటుండటంతో పోలీసులు దాడులు ప్రారంభించినప్పటికీ అక్రమ రవాణా ఆగడం లేదు. పోలీసుల కళ్లు గప్పి నకిలీ సరుకును జిల్లాకు చేరుస్తున్నారు. పోలీసుల దాడుల్లో పెద్ద మొత్తంలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. జిల్లాకు నకిలీ సరుకు చేరుతుండడంపై ధృష్టిసారించిన పోలీసులు పెద్ద మొత్తంలో విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.

## ప్రార్థనా మందిరాల వద్ద పోలీసు పహారా



**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
హోలీ, రంజాన్ మాసం దృష్ట్యా శుక్రవారం జిల్లాలోని పలు ప్రార్థనా మందిరాల వద్ద పోలీసు పహారా కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు శాంతి భద్రతలను పర్యవేక్షించారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థనలను దృష్టిలో ఉంచుకొని మత సామరస్యంతో మెలగాలని పోలీసులు ప్రజలకు సూచించారు. ముందస్తు బందోబస్తు నడుమ హోలీ వేడుకలు జరిగి శాంతియుత వాతావరణం కొనసాగడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## జన్నారంలో బందోబస్తు

**జన్నారం, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హోలీ పండుగ పురస్కరించుకొని నిర్వహించే సంబరాలలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. ఏఎస్ఐ బిక్కు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## సబ్‌స్టేషన్‌కు పవర్ ట్రాన్స్ఫార్మర్

**భీమారం, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
మండలంలోని గ్రామాల్లో వేసవిలో లో ఓల్టేజీ సమస్య రాకుండా ఉండేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈమేరకు హైదరాబాద్ నుంచి 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్ఫార్మర్లు శుక్రవారం తెప్పించారు. ఇప్పటి వరకు ఉన్న 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్ల స్థానంలో వీటిని బిగించనున్నట్లు ఏఈ శంకర్ తెలిపారు. ఈనేపథ్యంలో ముందస్తుగానే పీటీఆర్ సామర్థ్యం పెంచుతున్నామన్నారు. శనివారం సబ్ స్టేషన్‌లో బిగిస్తామన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల నిరసన



**మంచిర్యాల, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
అసెంబ్లీ నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలను నొక్కే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తుందని, దీన్ని ప్రజలందరు గమనిస్తున్నానన్నారు. ఈ కార్యక్ర మంలో పట్టణాధ్యక్షుడు గాదె సత్యం, నాయకులు గోగుల రవీందర్, ఎర్రం తిరుపతి, పడాల రవీందర్, శంకర్, గట్టయ్య, రుపతి, రవీందర్, ప్రశాంత్, భానుచందర్, అమృత్‌రాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు. భీమారంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపిన సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు భీమారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభు త్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, నాయకులు రాము, కళావతి పాల్గొన్నారు. లక్షెట్టిపేట పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం రాస్తారోకో చేపట్టా రు. ఈసందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీ నుండి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించే గొంతులను మూసేయడం సరికాదన్నారు. పోలీసులు నాయకులు చేస్తున్న నిరసనను బగ్నం చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై-2 రామయ్యకు వినతిపత్రం అందజేశారు. డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అద్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షు డు చిన్నయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు రాజన్న, శ్రీకాంత్ ఉన్నారు.

# ప్రభుత్వ భూమిలో అక్రమంగా కట్టడం



**మంచిర్యాల, మార్చి 14 (ప్రభాత సమాచారం)** అక్రమ నిర్మాణాలకు అంతే లేకుండా పోతుంది. యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించి అనధికారం కట్టడాలు చేపడుతున్నారు. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలోని ఎల్లారం గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 85 లో అక్రమంగా నిర్మాణాన్ని చేపడుతున్నాడు. నిర్మాణానికి అడ్డుగా ఉన్న భారీ వృక్షాన్ని నేలమట్టం చేశాడు. గమనిం చిన స్థానిక గిరిజనులు ఈ విషయంపై అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. 15 రోజులుగా నడుస్తున్న వ్యవహారంపై గ్రామ కార్యదర్శి సైతం ఆక్రమ నిర్మాణం చేపట్టకూడదని పలుమార్లు హెచ్చరించినా యథేచ్ఛగా నిర్మాణం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రోడ్లకు ఇరువైపుల నాటిన చెట్లు భారీ వృక్షాలు గొడ్డలి పెట్టుకు నేలరాలిన పట్టించుకునే అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ కట్టడానికి అడ్డుగా ఉన్న భారీ వృక్షాన్ని నరికి వేసిన ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు అంటున్నారు. పోచమ్మ దేవాలయానికి వచ్చే ప్రజలంతా ఈ చెట్ట వద్ద నీడను ఆపుకొని భోజనాలు చేస్తారని గ్రామస్తులు తెలిపారు. ఆక్రమణదారుడు వృక్షాన్ని ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి పర్మిషన్ తోనే తీసివేసినట్లు తెలిపారు. ఎంతచెప్పినా వినకపోవడంతో ఆక్రమణదారునికి పంచాయతీ కార్యదర్శి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. భూమిలో అక్రమ నిర్మాణం నిలిపివే యాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## నేటి నుంచి ఒంటిపూట అంగన్వాడీ కేంద్రాలు

**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** ఎండలు ముదురుతున్న నేపథ్యంలో శనివారం నుంచి అంగన్వాడీ కేంద్రాలను ఒంటి పూట నిర్వహించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. మంత్రి సీతక్క ఆదేశాలతో పాఠశాలల తరహాలోనే అంగన్వాడీలకు శనివారం నుంచి ఒంటి పూట అంగన్వాడీలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటల నుంచి 12:30 వరకు అంగన్వాడీ కేంద్రాలు నిర్వహించి పిల్లలను సకాలంలో తమ తల్లిదండ్రులకు అప్పజెప్పాలని అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

**కాగజ్‌నగర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** రవాణా శాఖ నియమాలను పాటించని వాహనదారుల పై కఠిన చర్యలు తీసుకుం టామని ప్రాంతీయ రవాణా అధికారి హెచ్చరించారు. సిర్పూర్ (టీ) మండల సరిహద్దులో వాహనాల తనిఖీలు నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవ సరాన్ని తెలిపారు. వాహనదారులు సరైన లైసెన్స్, రిజి స్ట్రేషన్, ఫిట్నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, ఓవర్ లోడ్, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయరాదని స్పష్టంచే శారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు, వాహన సీజ్, లైసెన్స్ రద్దు వంటి చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రోడ్డు భద్రత, ప్రజల రక్షణ కోసం రవాణా శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు.

## నాగులవాయిలో అగ్ని ప్రమాదం గడ్డికుప్ప దగ్ధం

**బెజ్జూర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** మండలంలోని నాగులవాయి గ్రామంలో శుక్రవారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. నాగులవాయి గ్రామానికి చెందిన వశాక విజయ్ చెందిన వరి గడ్డి కుప్ప వద్ద గ్రామస్తులు పొయ్యిలోని నిప్పులు పడేయడంతో ప్రమాదవశాత్తు నిప్పంటుకొంది. మంటలు చెల రేగి విజయ్ వరి గడ్డి కుప్ప దగ్ధమైంది. గ్రామస్తులు గమనించి, బిందెలతో అర్పించే ప్రయత్నం చేశారు. సంఘటనా స్థలాన్ని బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్, కానిస్టేబుల్ వెంకన్న సందర్శించి గ్రామస్తులు సహకారంతో, నీళ్ల బిందెలతో అర్పించే ప్రయత్నం చేశారు. మంటలు, ఆరకపోవడంతో కాగజ్‌నగర్ అగ్నిమాపక కేంద్రానికి, బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్ సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది. నాగులవాయి గ్రామాన్ని చేరుకుని, ఫైర్ ఇంజన్‌తో మం టలు అర్పించారు. దీంతో నాగులవాయి గ్రామానికి పెనుప్రమాదం తప్పింది.

## సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య

**మంచిర్యాల, మార్చి 14 (ప్రభాత సమాచారం)** జీవితంపై విరక్తితో సింగరేణి ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై దివాకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గర్మిళ్లకు చెందిన సింగరేణి ఉద్యోగి వీర్ల శ్రీధర్ (43) సింగరేణి ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యతో గొడవ పడేవాడు. మద్యం మానేయాలని భార్య శ్రీకరి మందలించడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. గురువారం రాత్రి ఇంట్లో తన గదిలో లుంగీతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన




**ఆసిఫాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** పెండింగ్ వేతనాలు చెల్లించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్లు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దినకర్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్లకు ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. హోలీ పండు గ రోజు సైతం సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాము, పద్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-3 ఫలితాల్లో మనోళ్ల సత్తా

**- మందమర్రికి చెందిన బొడ్డు తిరుపతికి 60వ ర్యాంకు - గుడ్లబోరికి చెందిన భాస్కర్‌కు 154 ర్యాంక్**
**- రాష్ట్రస్థాయిలో 39వ ర్యాంక్ సాధించిన గుడిపేట వాసి లెక్కల శ్రావణ్**





**మంచిర్యాల, మార్చి 14 (ప్రభాత సమాచారం)** శుక్రవారం వెలువడిన గ్రూప్-3 ఫలితాల్లో మంచిర్యాల జిల్లా వాసులు సత్తాచాటారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన లెక్కల లింగయ్య-కళావతి దంపతుల కుమారుడు శ్రావణ్ రాష్ట్ర స్థాయిలో 39వ ర్యాంక్ సాధించాడు. మూడు రోజుల క్రితం వెలువడిన గ్రూపు 2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 97వ ర్యాంక్ తెచ్చుకున్నాడు. గ్రూప్-4లో స్టేట్ లెవల్‌లో 210వ ర్యాంక్, జిల్లాలో 11వ ర్యాంక్ సాధించి బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో పంచాయతీ కార్యదర్శి పోస్టుకు జిల్లా మొదటి ర్యాంక్ సాధించాడు. కొద్ది రోజులు ఉద్యోగం చేసి.. తర్వాత రాజీనామా చేశాడు. ప్రస్తుతం గ్రూప్-3 ఫలితాల్లో విజయం సాధించి ప్రశంసలు అందుకుంటున్నాడు.

**మందమర్రికి చెందిన బొడ్డు తిరుపతికి 60వ ర్యాంక్**

మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన బొడ్డు పోశక్క-భూమయ్య దంపతుల చిన్న కుమారుడైన తిరుపతి స్థానిక కార్మెల్ పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. ఆపై బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ డిప్లొమా విద్యనభ్యసించాడు. 2016లో సింగరేణి సంస్థలో జేఎంఈటీ నోటిఫికేషన్ వెలువడగా, పరీక్ష రాసి ఉద్యోగం సాధించాడు. అనంతరం దూరవిద్య కాకతీయ యునివర్సిటీలో బీఏ పూర్తి చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన గ్రూప్-4 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి క్యాతనపల్లి మున్సిపాలిటీ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం పొందాడు. గ్రూప్-2లో రాష్ట్రస్థాయిలో 77వ ర్యాంకును సాధించాడు. శుక్రవారం వెలువడిన గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 60వ ర్యాంకు సాధించాడు. వరుస ఉద్యోగాలు సాధించిన తిరుపతిని కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు. గ్రూప్-1 సాధించడమే తన లక్ష్యమని, అందుకు సిద్ధమవుతున్నానని తిరుపతి తెలిపాడు.

**గుడ్లబోరికి చెందిన భాస్కర్‌కు 154వ ర్యాంక్**

కౌటల మండలం గుడ్లబోరి గ్రామానికి చెందిన భాస్కర్ 2016లో సింగరేణి సంస్థలో ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా స్టోర్స్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్-2 ఫలితాల్లో 229 ర్యాంక్ సాధించగా, తాజాగా గ్రూప్-3 ఫలితాల్లో 154 ర్యాంక్ సాధించి ప్రతిభ చాటుకున్నాడు.

## తాను లేకపోయిన ఇద్దరికి చూపునిచ్చాడు

**మందమర్రి, మార్చి 14 (ప్రభాత సమాచారం)**



మందమర్రి పట్టణంలోని మొదటి జోన్‌కు చెందిన జీదుల రాయమల్లు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఆయన బతికి ఉండగానే తన మరణానంతరం కళ్లు దానం చేయాలని కుమారుడు దామోదర్‌కు చెప్పేవాడు. రాయమల్లు మరణంతో దామోదర్ (ప్రభుత్వ ఉపాధ్యాయుడు) తండ్రి కోరిక మేరకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులకు సమాచారం అందించాడు. వైద్యుడు కిషోర్ నేతృత్వంలో ఎంజీఎం వైద్యులు ప్రదీప్ రాయమల్లు ఇంటి కి చేరుకుని నేత్రాలు సేకరించారు. ఈ వారు మాట్లాడుతూ రా యమల్లు రెటనాలతో ఇద్దరికి చూపు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సోపతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు భీమపుత్ర శ్రీనివాస్, రహీమ్ బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు రహీం, అవయవ దాతలు, శరీర దాతల సంఘం సభ్యులు బాబీ, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## కేబుల్ వైర్ల చోరీ దొంగల ముఠా అరెస్ట్

**నిర్మల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** కేబుల్ వైర్ల దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిజామాబాద్ ప్రాంతానికి చెందిన ఐదుగురు దొంగలు శుక్రవారం మండలంలోని ఎల్లపల్లి శివారులో మోటార్ కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లారు. రూరల్ ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో కొండాపూర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వీరు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వాహనం తనిఖీ చేయగా అందులో కేబుల్ వైర్లు లభ్యమయ్యాయి. దీంతో నిందితులను అరెస్టు చేసి రిమాండు తరలించి నట్లు ఎస్సై వివరించారు.





## పండుగ పూట విషాదం

# ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యార్థి మృతి

■ మరో విద్యార్థికి తీవ్ర గాయాలు ■ మిన్నంటిన రోదనలు ■ ఆదిలాబాద్ పట్టణంలో ఘటన





**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
పండుగ పూట విషాదం చోటుచేసుకుంది. అప్పటివరకు హోలీ సంబరాల్లో స్నేహితులు, కుటుంబీకులతో గడిపిన ఓ విద్యార్థి ద్విచక్రవాహనం అదుపుతప్పి కానరాని లోకాలకు చేరాడు. తమ కుమారుడు లేడన్న నిజాన్ని ఆ కుటుంబీకులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త కుమ్మరా వాడకు చెందిన జిల్లెడ్వార్ ఊశన్న మేస్త్రి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు జిల్లెడ్వార్ రుషికుమార్ (16) ఆదిలాబాద్ పట్టణంలోని సేవదాస్ విద్యామందిర్లో పదో తరగతి చదువుతున్నాడు. ఉదయం రుషికుమార్తో పాటు మరో ఇద్దరు స్నేహితులు పట్టణంలోని బాలాజీనగర్ కు చెందిన ఆమ్ల ప్రేమ్, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కచ్ కంటికి చెందిన బడేన్వార్ అశ్విన్తో కలిసి హోలీ సంబరాలు చేసుకున్నారు. అనంతరం అశ్విన్ను ఇంటివద్ద దింపడానికి ముగ్గురు బైక్పై వెళ్లారు. ఆ తర్వాత ఇద్దరు తిరిగి వస్తుండగా పట్టణంలోని ఎరోడ్రాం సమీపంలో మూలమలుపు వద్ద బైక్ అతివేగంగా నడపడంతో అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం రిమ్స్ కు తరలించారు. కాగా రుషికుమార్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్ర గాయాల పాలైన ఆమ్ల ప్రేమ్ బతికి బయటపడ్డాడు. ప్రస్తుతం రిమ్స్ లో చికిత్స పొందుతున్నాడు.

# ప్రాణహిత నదిలో మునిగి యువకుడు మృతి

■ హోలీ ఆడి స్నానానికి వెళ్లడంతో ప్రమాదం ■ పండుగపూట విషాదం

**వేమనపల్లి, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
హోలీ పండుగ ఆ ఇంటి ఆశాదీపాన్ని ఆర్పేసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్నేహితులతో హోలీ ఆడిన ఆ యువకుడు స్నానం కోసం ప్రాణహిత నదిలో దిగాడు. అయితే లోతు, వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో నీటిలో కొట్టుకుపోయి మృతిచెందాడు. ఈ విషాద ఘటన వేమనపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే... మండల కేంద్రంలోని బెస్తవాడకు చెందిన కంపెల రాజ్‌కుమార్ (21) చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. పండుగ నేపథ్యంలో స్నేహితులు కంపెల నవీన్, అనిల్, బక్కి రాకేశ్, చింతల అభిషేక్, గుమ్మల సాయికిరణ్ కలిసి గ్రామంలో హోలీ జరుపుకున్నాడు. మధ్యాహ్నం స్నేహితులతో కలిసి ప్రాణహిత నది పుష్కర ఘాట్ ఎగువన ఉన్న మొహిబిస్పేట రేవు వద్దకు స్నానాలకు వెళ్లారు. సాయికిరణ్, రాజ్‌కుమార్ నదిలో దిగగా, మరో నలుగురు ఒడ్డున ఉన్నారు. అయితే స్నానాలకు దిగిన



ప్రదేశంలో లోతు ఎక్కువగా ఉండడం, వరద ఉధృతి కూడా ఎక్కువగా ఉండడంతో రాజ్కుమార్ కొట్టుకుపోయాడు. ఈత రాకపోవడంతో సాయికిరణ్ కాపాడే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో మిగతా స్నేహితులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ సిబ్బందితో ఘటన స్థలికి చేరుకున్నాడు. జాలర్ల సాయంతో మూడు గంటలు గాలించగా సాయంత్రం రాజ్‌కుమార్ మృతదేహం లభించింది. పండుగను సంబురంగా



జరుపుకున్న రాజకుమార్ను విగత జీవిగా నదిలో నుంచి తీసుకు వస్తుండగా చూసిన తల్లి లక్ష్మి 'నువ్వు పురిటిలో ఉండగానే మీ నాన్న కాలం చేసిండు కద కొడుకా.. కూలీనాలి చేసి.. జిమ్మలు పట్టుకుంటూ నిన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటే.. మనం నమ్ముకున్న గంగమ్మే నిన్ను మింగిందా బిడ్డా.. నాకు కడుపు కోత మిగిల్చింది. కొడుకా' అంటూ గుండెలు పగిలేలా రోదించింది. ఒక్కగానొక్క కొడుకు మరణంతో కన్నీరుమున్నీరవుతున్న లక్ష్మిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు.



## ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**ఖానాపూర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాజగంగన్న, పట్టణాధ్యక్షుడు గౌరికార్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జగన్నాథ్ రావు చౌరస్తాలో ఆందోళన చేశారు. అంటేడ్కర్ చౌరస్తాలోని కూరగాయల మార్కెట్ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కాగా, దిష్టిబొమ్మ దహనానికి అనుమతి లేకపోవడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. నా యకులు అబ్దుల్ ఖలీల్, సుమన్, ప్రదీప్, గజేందర్, శ్రావణ్, నరేందర్ రెడ్డి, సుమిత్, చంద్రహాస్, షోయబ్, దివాకర్, మహిపాల్, మ హేందర్, వెంకటేశ్వర్రావు, రమేశ్, శ్రీనివాస్, లాజర్, శ్రీకాంత్, నరేశ్ తదితరులున్నారు.

## మద్యం మత్తులో బలవన్మరణం

**కౌటాల, మార్చి 14 (ప్రభాత సమాచారం)**



మద్యం మత్తులో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఎన్. మధుకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలం గురుడు పేట గ్రామానికి చెందిన తలండి రవి (27)గతకొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం మద్యం మత్తులో హోలీ ఆడి రాత్రి తాగిన మైకంలో ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ మండలం ఈజ్గాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించిగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి తలండి చిన్నన్న ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## సీఎం దిష్టిబొమ్మ దహనం

**ఆసిఫాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. వారు మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్రెడ్డిని శాసనసభ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## జన్నారంలో హోలీ సంబరాలు

**జన్నారం, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండల కేంద్రం తోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామస్తులు మహిళలు యువత హెూలీ సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం హోలీ సందర్భంగా పలు వ్యాపార సంస్థల యజమానులు బందు పాటించి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. హోలీ సంబరాలు చేస్తున్న అనంతరం యువకులు చాలామంది పక్కనే ఉన్న గోదావరి నదికి వెళ్లి స్నానాలు ఆచరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకున్నారు.

## గొల్లపల్లిలో అగ్ని ప్రమాదం

**నెన్నెల, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీకి పెను ప్రమాదం తప్పింది. గ్రామశివారు ఒర్రెలోని పొదలకు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం మధ్యాహ్నం నిప్పు పెట్టారు. దాదాపు అర కిలోమీటర్ మేర మంటలు వ్యాపించాయి. ఎస్సీ కాలనీ అతి సమీపానికి మంటలు రావడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. పోలీసులు, ఫైర్ స్టేషన్కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది గంటపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. కొంత ఆలస్యమైన కాలనీలోని ఇళ్లన్నీ బుగ్గిపాలయ్యేవని ప్రజలు పేర్కొన్నారు. సకాలంలో ఫైరింజన్ చేరుకోవడంతో ముప్పు తప్పిందన్నారు. ఎస్సై ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## అనభేరి ప్రభాకర్ రావు సేవలు మరువలేనివి

**ఖానాపూర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
పేదప్రజలు, పీడిత జనుల ఆర్తనాదాలను ఆపి బానిస బతుకులను రూపుమాపేందుకు అవతరించిన తెలంగాణ భగత్ సింగ్ అనభేరి ప్రభాకర్ రావు సేవలు మరువలేనివని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య కొనియాడారు. పట్టణంలోని ఆర్అండీబీ విశ్రాంతి భవనం ఆవరణలో ఎల్లాపి సంఘం నిర్మల్ డివిజన్ అధ్యక్షుడు పుప్పాల మురళి అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కరీంనగర్ జిల్లా పోలంపల్లికి చెందిన ప్రభాకర్ రావు విద్యార్థి దశ నుంచే నిజాం వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. పాలేర్ల పిల్లలకు చదువులు చెప్పించడంతో పాటు తన ఇంట్లో ఉండే పని మనుషులకు వివాహాలు చేసి వారి జీవితాల్లో స్వేచ్ఛ వెలుగులు నింపి స్త్రీ జాతి గౌరవాన్ని కాపాడారని గుర్తు చేశారు. నేతన్నలను ఆకలిచావుల నుంచి తప్పించడంతో పాటు పటేల్, పట్వారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. నిజాంకు సింహస్వప్నంలా మారి తెలంగాణ ప్రజల విముక్తికి ఉద్యమించిన అనభేరి విగ్రహాన్ని ట్యాంక్ బాండ్పై ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దయానంద్, అంకం రాజేందర్, నిమ్మల రమేశ్, గంగనర్సయ్య, గణపతిరావు, పడాల మోహన్ రావు, పెరిక గంగాధర్, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

## గ్రూప్ -3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 417వ ర్యాంకు

**తాంసి, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
తాంసీకి చెందిన జానకొండ అశోక్ కుమార్ గ్రూప్-3 ఫలితాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించాడు. ఇప్పటికే గ్రూప్-1లో 399 మార్కులు, గ్రూప్-2లో 380 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 250వ ర్యాంక్ సాధించాడు. గ్రూప్-3లో 284 మార్కులతో రాష్ట్రస్థాయిలో 417వ ర్యాంక్ సాధించాడు. వరుసగా ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్న అశోక్ ప్రస్తుతం జైనథ్ మండలం సుందరగిరి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఉన్నత ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివానని అశోక్ కుమార్ తెలిపాడు.







## అంబరాన్నంటిన

# హోలీ సంబరాలు

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా హోలీ వేడుకలు

**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. అధికారులు, ప్రజాప్రతి నిధులు హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్నివర్గాల ప్రజలు తీరొక్క రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రధాన కూడళ్లలో డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకుని నృత్యాలు చేశారు. డప్పుచప్పుళ్లతో వీధుల్లో తిరుగుతూ వేడుకలు నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ పాల్గొన్నారు. నిర్మల్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అభిలాష అభినవ్ కుటుంబ సభ్యులతో కలిసి హోలీ పండుగను నిర్వహించుకున్నారు. మంచిర్యాల కలెక్టరేట్ కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్ సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా హోలీ పండుగను జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ, మిఠాయిలు తినిపించుకుంటూ ఉద్యోగులు, సిబ్బందితో డ్యాన్స్‌లు చేశారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా ప్రజలకు హోలీ శు భాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు కలెక్టర్, ఎస్పీని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఎస్పీ క్యాంపు కార్యాలయంలో వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో హోలీ పండుగ సందర్భంగా పోలీసు సిబ్బందితో హోలీ సంబరాలు జరుపుకున్నారు. అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల శంకర్ వేడుకల్లో పాల్గొన్నారు. నిర్మల్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం కలెక్టర్ అభిలాష అభినవ్ కుటుంబ సభ్యులతో కలిసి హోలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. హోలీ పండుగలో





భాగంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనా, అధికారులు, కలెక్టర్ క్యాంపు కార్యాలయ సిబ్బంది, పలువురు పాత్రికేయులతో కలిసి హోలీ పండుగను జరుపుకున్నారు. పరస్పరం ఒకరినొకరు రంగులు పూసుకుంటూ హోలీ పండుగ శు భాకాంక్షలు తెలియజే సుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులు సిబ్బందికి మిఠాయిలు పంచారు. జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగను నిర్వహించుకోవాలని సూచించారు.

**భైంసా పట్టణంలో..**

భైంసా పట్టణంలోని పలు వాడలు, కాలనీవా ఘనంగా హోలీ సంబు రాలు జరుపుకున్నారు. ఎస్ఎస్ జిన్నింగ్ కార్యాలయంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ అభిమానులు కార్యకర్తలు సమక్షంలో హోలీ సంబరాలు జరుపుకొని, నృత్యాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, మోహన్ రావు ప్రజా ట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తమ అభిమానులతో హోలీ సంబరాలను జరుపుకున్నారు.

**మంచిర్యాల జిల్లాలో..**

కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆనందో త్సావాల మధ్య హోలీ వేడుకలను నిర్యహించారు. కలెక్టర్ కుమార్ దీపక్ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్ కలెక్టర్‌పై రంగులు చల్లి హోలీ శుభా కాంక్షలు తెలిపారు. పాత్రికేయులు కలెక్టర్‌తో హోలీ వేడు కల్లో పాల్గొన్నారు. చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో హోలీ సంబరాల్లో ప్రజలంతా మునిగితేలారు.

**ఉట్నూర్‌లో..**

ఉట్నూర్‌లో హోలీ వేడుకలను ప్రజలను శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. డీఎస్పీ కార్యాలయంలో పోలీసులు సంబరాలు జరుపుకున్నారు. పలు సంఘాలు, పార్టీ నాయకులు డీఎస్పీ నాగేందర్ కి శుభాకాంక్షలు తెలిపారు. సంప్రదాయ రీతిలో హోలీ పండుగను జరుపు కున్నారు. గిరిజన గ్రామాల్లో డోలు వాయిస్తూ జాజిరి.. జాజిరి అంటు వేషాధారణలు ధరించి, నృత్యాలు చేశారు.

**హోలీ సంబరాల్లో ఎమ్మెల్యే..**

కాగజ్ గర్ పట్టణంలోని సిర్పూర్ ఎమ్మెల్యేలతో హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పాల్వ హరీష్ బాబు నివాసంలో మున్సిపల్ కార్మికు మున్సిపల్ కార్మికులకు ఎమ్మెల్యే హరీష్ బాబు రంగులు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీజేపీ కార్యకర్తలతో హోలీ సంబరాలు జరుపుకున్నారు.

**అంబరాన్నంటిన హోలీ సంబరాలు**

మం చిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం హోలీ వేడుకలను ఘ నంగా నిర్వహించారు. కాలనీలు, వీధుల్లో సందడి నెలకొం ది. చిన్నారులు, యువతీ, యువకులు రంగులు చల్లుకుం టూ సందడి చేశారు. డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్తూ స్వీట్లు పంచుకుంటూ సంబరాలు నిర్వహించుకున్నారు. వీ ధులన్నీ రంగుల హరి విల్లులను తలపించాయి. ఒకరికి ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీల హోలీ వేడుకలు ఘ నంగా నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని రం గులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఫసంజీవయ్యనగర్‌లో గల ఆశ్రమ పాఠశాలలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హాస్టల్ సంక్షేమాధికారి నైతం లక్ష్మణ్ విద్యార్థులతో కలిసి నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకున్నారు. మంచిర్యాలలోని డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్ క్లబ్ సభ్యులు హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, సంపత్‌కుమార్, మహేష్, అనంతరెడ్డి, మహేష్, శ్రీనివాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు. మంచిర్యాల పట్టణంలో హోలీ పండగ వేడుకలు శు క్రవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని బాయ్స్ స్కూల్ గ్రౌండ్‌లో ఫిట్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. కార్యక్రమంలో సెంటర్ అధ్యక్షుడు దార కుమారస్వామి, తుల ఆంజనేయులు, చంద్రకాంత్, అశోక్, దేవరాజు, శ్రీనివాస్ రెడ్డి, హనుమాండ్లు పాల్గొన్నారు. పట్టణంలోని ఆదిత్యఎన్‌క్లేవ్ కాలనీలో కాలనీ వాసులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంచి ర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో హోలీ పండగ సంబరాలను ఘ నంగా నిర్వహించారు. బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు ఒకరిపై ఒకరు రంగు లు చల్లుకుంటూ ఉత్సాహంగా గడి పారు. కార్యక్రమలో నాయకులు లక్ష్మణ్, సంతోష్, ఉత్తేజ్, రమేష్ పాల్గొన్నారు.

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో..**

భారతీయ సంస్కృతి, ప్రజల ఐక్యతకు ప్రతీక హోలీ పండగ అని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో పలువురు



అధికారులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రంగులు చల్లుకుని ఒకరికి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మనుషుల మధ్య ప్రేమానురాగాలను పండగలు తెలియజే స్తా యని, ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకో వాలని పేర్కొన్నారు. హోలీ రంగుల పండగ మాత్రమే కాదని, ప్రజల ఐక్యతకు పండగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు వెంకటేశ్వర్లు, దుర్గా ప్రసాద్, రవీందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, పురుషోత్తం, రాజేంద్ర ప్రసాద్ పంచాయతీ అధికారుల సంఘం నాయకులు శ్రీపతిబాపు పాల్గొన్నారు. తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కొరెంగ మాలశ్రీ మహిళలతో కలిసి హెూలి పండగ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పండుగ అందరు కలిసి చేసుకునే పండుగ హోలీ అన్నారు.

**హోలీ పండుగ జీవితాలను రంగుల మయం చేయాలి**

**రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా**

రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో హెూలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. హెూలీ పండుగను పురస్కరించుకొని రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయమునకు చేరుకున్న పోలీస్ అధికారులు, సిబ్బంది కలిసి ముందుగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గారికి రంగులు పూయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ గారు అధికారులు, సిబ్బందికి రంగులు పూసి హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ వేళ అధికారులు సిబ్బంది పరస్పరం రంగులు పూసుకోవడంతో పాటు బ్యాండ్ వాయిద్యాలతో పోలీస్ కమిషనర్, అధికారులు, సిబ్బంది, అందరు ఆనందం తో నృత్యాలు చేశారు. అనంతరం ఈ సంబరాల్లో పాల్గొన్న చిన్న పిల్లలకు పోలీస్ కమిషనర్ గారు మిఠాయిలను అందజేసారు. ఈ హెూలీ వేడుకలను పురస్కరించుకొని పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరి కుటుంబంలో సంతోషాలు, వెల్లువిరియాలని, ఈహెూలీ పండుగ మీ జీవితాలను రంగులమయం చేయాలని తెలిపారు. ఈ వేడుకల్లో మంచిర్యాల డిసిప్ ఎ,బాస్కర్ ఐపిఎస్., అడిషనల్ డిసిపి అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, గోద్వారిఖని ఎసిపి ఎం.రమేష్, ట్రాఫిక్ ఎసిపి నర్శింహులు, టాస్క్ ఫోర్సు ఎసిపి మల్లరెడ్డి, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, సిసి హరీష్ , ఎస్.ఐ, ఆర్ ఎస్ఐ లు ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కలియుగ కల్పవృక్షం..

# వేపచెట్టు



మనిషి జీవితానికి.. వేప వృక్షానికి అవినాభావ సంబంధం ముడిపడి ఉంది. ప్రకృతి రిత్యా లభించే వేప చెట్టుతో ప్రకృతికి మానవాళికి కలిగే మేలు అంత ఇంత కాదు.. వివిధ ప్రాంతాల్లో, వివిధ దేశాలలో వేప చెట్టును అనేక రకాల పేర్లతో పిలుస్తారు. సతత హరిత వృక్షంగా పేరిగే ఈ వృక్షం ఆకురాలే కాలంలో ఆకులు రాలి వర్షభావ పరిస్థితులను తట్టుకొని పెరుగుతు మానవాళికి అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. భారతదేశంలో 5 వేల సంవత్సరాలకు పూర్వం నుండే వేపను గుర్తించి దాని ఫలితాలను పొందుతున్నట్లు తెలుస్తుంది.

### ఆహారంగా..

తమిళనాడులో వేప లేత చిగుళ్ళ, పుష్పాలను ఉడికించి రసంగా తక్కువ పరిమాణంలో తీసుకొనుట వల్ల్ జీర్ణనాళానికి సంబంధించిన రుగ్మతలను నియంత్రించవచ్చునని నమ్ముతారు. పశ్చిమ బెంగాల్‌లో వేప లేత పత్రాలను వంకాయతో కలిపి బేగన్ అనే వంటకాన్ని అన్నంతో కలిపి తినటం వల్ల అది ఆకలిని ప్రేరేపిస్తుందని భావిస్తారు. ఇతర ఆగ్నేయాసియా దేశాలలోనూ, బర్మా, వియత్నాం, కంబోడియా మొదలైన దేశాలలో చింతపండుతో కలిపి వేప చిగుర్ళు, పుష్పాలను మరిగించి తయారు చేసిన పులుసు చేదు లక్షణం తక్కువగా ఉండుట వల్ల ఆహారంగా ఉపయోగిస్తుంటారు.

### సాంప్రదాయ వైద్యంలో..

వేప ఆకులను వేడి నీటిలో కొది సేపు ఉంచిన తదుపరి ఆ నీటితో స్నానం చేయుట వల్ల చర్మ సంబంధ వ్యాధులను నయం చేయవచ్చును. మన దేశంలో, మన రాష్ట్రంలో అమ్మతల్లి (పోచమ్మ-చికెన్ ఫాక్స్) అయినప్పుడు కూడ వేప ఆకులు, ఔషదంగా ఉపయోగిస్తారు. మానవుడి రక్తంలోని చక్కెరను సమతా స్థితిలో ఏంచేందుకు వేప చెట్టు లేత చిగుర్లను లేదా వాటి రసాన్ని ఔషదంగా వాడుతారు. ఎండిపోయిన వేప ఆకులను పొడి చేసి బియ్యంలో కలిపి నిలువ చేసినపుడు, తెల్లపురుగు, లక్క పురుగు, ఆవాసం చేసే లక్షణాన్ని ఎక్కువ శాతం వరకు నియింత్రింవచ్చును.



### వైద్య రంగంలో..

మనదేశంలో వేపను ప్రకృతి ఔషద బండాగారం గా సర్వ రోగ నివారిణిగా, పిలుస్తారు. వేప ఉత్పాదాకాలను శిలీంధ్ర, బ్యాక్టీరియా, వైరస్ నాశనులుగా, మధుమేహాన్ని నియంత్రణలో ఉంచేటందుకు, క్యాన్సర్ నివారణకు కూడా తోడ్పతున్నట్లు అనేక పరిశోధనల వల్ల తెలుస్తుంది. అంతే కాకుండా ఆయుర్వేద, యునాని ఔషదాల తయారీలో కూడా వేప పత్రాలను, లేత బెరడును విరివిగా వాడుతారు. ఈ విధంగా వేప ఇన్ని ఔషద గుణాలు కలిగి ఉండడం వల్ల వేప పువ్వును ఆంధ్రప్రదేశ్, కర్ణాటకాలలో బెల్లం, చింత పులుసులో కలిపి ఉగాది పచ్చడిగా ఆ పర్వదినాన తాగుతారు. ఎండిపోయిన వేప పండ్ల ద్వారా తయారు చేసిన వేప పిండిని సాగు నేలలో కలిపినపుడు అది సహజ కీటక నాశినిగా, ఇతర చీడ పీడలకు సంబంధించిన గుడ్ల నుంచి వాటి డింభకాలు ఏర్పడకుండా నిరోదిస్తుంది. ఇన్ని విశిష్ట లక్షణాలు కలిగి ఉన్నది. వేపను ఒక పవిత్ర వృక్షంగా పూజిస్తారు. కృత్రిమ క్రిమి సంహార రసాయనాలను సమాంతరంగా వేప పిండిని కూడా సహజ క్రిమి కీటక నివారణాలు ఉపయోగిస్తారు.

### ఇతర ఉపయోగాలు

వేప చెట్టు లేత పుల్లలను, పండ్లు శుభ్రము చేసుకొనుటకు ఉపయోగిస్తారు. వేప నూనెను చర్మ కేశ, దంతాల రక్షణకు భిన్నమైన రూపాలలో ఉపయోగిస్తారు. వేప నూనెలో ఉన్న ఔషద గుణాలు మానవుడిలో ఉన్న అతి పెద్ద గ్రంథి, జీర్ణక్రియలో ఉపయోగపడే కాలేయం విధులను ప్రేరేపించి రక్తాన్ని శుభ్రపర్చడానికి దోహదపడుతుంది. బాగా శుబ్రపరిచిన వేప నూనెను గోర్లకు వేసుకునే రంగులోను, స్త్రీలు ఉపయోగించే ఇతర సౌందర్య ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. వేప గింజల నుండి తీసిన నూనెను సబ్బులలో, టూత్ పేస్టు లో ఉపయోగిస్తారు. వేప నుంచి తీసిన జిగురు కొన్ని ప్రత్యేకమైన లక్షణాలను కలిగి యుండటం వల్ల అతి తక్కువ బాఘతలో ఉపయోగించి కొన్ని రకాల ఆహారంగా పదార్థాలను నిల్వ చేసినపుడు సంరక్షిణిగా పని చేస్తుంది. వేప నూనె నుంచి తీసిన నింబిన్,నింబియిన్,నింబిడిన్ అనే మూడు రకాల చేదు పదార్థాలు ఔషద గుణాలను, సహజ చీడ పీడ నాశిని లక్షణాలను కలిగి ఉంటాయి. హోమియోపతిలో పలు రకాల రోగాలను నయం చేసే గుణం దీనికి ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విధంగా వేపచెట్టు వేరు, కొమ్మ, పూలు, కాయుల, పండ్లు గింజలు, బెరడు, బెరడు తీసిన మధ్య భాగం, పచ్చి ఆకులు, ఎండు ఆకులు, వేప చెట్టు క్రింది గాలి ఇలా ప్రతి భాగం మానవాళికి ఎంతో ఉపయోగపడుతుంది. ఈ వృక్షం ముఖ్యంగా వాతావరణంలో ఉన్న కార్బన్ డై ఆక్సైడ్‌ను ఎక్కువగా గ్రహిస్తుంది. ఫలితంగా ఇది కాలుష్య నివారిణిగా కూడా పనిచేస్తుంది. ఎండిన వేపను కలపగా కూడా ఉపయోగించు కోవచ్చును. ఇన్ని విధాలుగగా ఉపయోగపడే వృక్షంతో సమానమైన వృక్షం మరోటి లేదన్నది నిజం.



### సామాజిక బాధ్యత..

మన దేశంలో , రాష్ట్రంలో నీడ కొరకు వేప చెట్లను పాఠశాలలో, కళాశాలలో, కార్యాలయాలలో దేవాలయాల చుట్టు ఉన్న ఖాళీ ప్రదేశాలలో పెంచడం మనం బాధ్యతగా స్వీకరించాలి. సామాజిక అడవుల పెంపకంలో భాగంగా వేప మొక్కలను నీడ కొరకు విరివిగా రహదారుల వెంట కూడా పెంచవచ్చును. గత 3 దశాబ్దాల నుంచి అనేక రంగాలలో అభివృద్ధి పేరిట విస్తరించిన మానవ కార్యకలాపాల వల్ల సహజమైన ప్రకృతిని ధ్వంసం చేస్తు కృత్రిమమైన ప్రకృతిని నిర్మించే క్రమంలో ఎంతో వయస్సు కలిగిన వృక్ష సంపద నరికి వేతకు గురవుతోంది. ఉదాహరణకు రహదారుల వెడల్పు పేరిట నీడను ఇచ్చే 20 సంవత్సరాల పై బడిన వేప చెట్లు కూడా నరికి వేతకు గురవుతున్నాయి.




కాలుష్య నివారిణిగా పని చేసే ఈ వృక్షం లేక పోవడం వల్ల వాతావరణంలో సీఓ2 పరిమాణం పెరగటం వల్ల అసాధారణంగా ఉష్ణోగ్రతలు పెరిగేటందుకు అవకాశం ఉంటుంది. ఇన్ని విశిష్ట లక్షణాలు కలిగిన వేప ప్రాముఖ్యతను నవ తరానికి తెలియచేయవలసిన బాధ్యత మనందరిది. ఇప్పటకైన అనేక రకాలుగా అర్థికంగా ఉపయోగపడే మొక్కల గురించి పాఠ్యాంశాలలో పొందుపరిచారు. వాటి గురించి విశదంగా బోధించే బాధ్యత ప్రస్తుతం ఆపాధ్యాయునిది. అధ్యాపకునిది. ఇన్ని గొప్ప లక్షణాలను కలిగి ఉన్న వేప వృక్షంను మనందరం సామాజిక బాధ్యతగా గుర్తించి కాపాడుకోవాలి. రేపటి తరానికి దీని ప్రాముఖ్యతను తెలియచే యాలి. దీన్ని ప్రతి సంవత్సరం దనమహోత్సవం సందర్భంగాగ అన్ని కళాశాలల్లోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్ళు, పాఠశాలలోని విద్యార్థులు కూడా తప్పకుండా అ వేప మొక్కను నాటే ప్రయత్నం చేయాలి.

# ఆనందకేళి రంగేళి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు అన్నివర్గాల తీరొక్క రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రధాన కూడళ్లలో డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకుని నృత్యాలు చేశారు. డప్పుచప్పుళ్లతో వీధుల్లో తిరుగుతూ వేడుకలు నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల శంకర్ వేడుకల్లో పాల్గొన్నారు. నిర్మల్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అభిలాష అభినవ్ కుటుంబసభ్యులతో కలిసి హోలీ పండుగను నిర్వహించుకున్నారు. మంచిర్యాల కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్ సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు.


















# మళ్లీ వస్తున్నా



తన అందం అభినయంతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి పాపులారిటీ సంపాదించుకుంది శ్రేయశరన్. కెరీర్ స్టార్టింగ్‌లో ట్రెడిషనల్‌గా ఆకట్టుకున్న ఈ భామ.. 'మల్లన్న' సినిమాతో బోల్డ్‌గా రెచ్చిపోయింది. దీంతో ఈ అమ్మడు పై నెగిటివిటీ రావడమే కాకుండా ట్రోలింగ్ కూడా పెద్ద ఎత్తున చేశారు. దీంతో చేసేది ఏమి లేక ఇండస్ట్రీకి దూరం అయింది. కాగా ఈ బ్యూటీ ప్రస్తుతం రీ ఎంట్రీ ఇవ్వడానికి రెడీగా ఉంది. ఈ క్రమంలో శ్రియ శరన్ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా శ్రియ తన ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేసింది. అందులో తన భర్తతో ఉన్న పెళ్లి ఫొటోను షేర్ చేసింది. ఇక దానికి.. 'నిన్నటిలా ఉంది. వార్షికోత్సవ శుభాకాంక్షలు' అంటూ రాసుకొచ్చింది.

# అయోధ్యలో పాగా

అయోధ్యలో మరోసారి భూమి కొన్నారు. అయితే ఈసారి తను నిర్వహిస్తున్న హరివంశ్ రాయ్ బచ్చన్ ట్రస్ట్ కోసం ఈ భూమి కొనుగోలు చేసినట్లు సమాచారం. 54,454 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న ల్యాండ్‌ను ఎంపిక చేసుకున్నారట. రామమందిరానికి 10 కిలోమీటర్ల దూరంలో ఈ భూమి ఉంది. దీనికోసం ఆయన రూ.86 లక్షలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. తండ్రి హరివంశ్ రాయ్ గౌరవార్థం అక్కడ స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంది.అమితాబ్ గతేడాది జనవరిలో అయోధ్యలోని హవేలి అవధ్‌లో ప్లాట్ కొన్నారు. ఇందుకోసం దాదాపు రూ.4.54 కోట్లు వెచ్చించారు. ఈ ప్లాట్ కొనుగోలు చేసిన ప్రదేశానికి 10 నిమిషాల ప్రయాణ దూరంలో రామాలయం, 20 నిమిషాల దూరంలో అయోధ్య అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్నాయి.



# ఇదే నా చూడదగ్గ లుక్



టాలీవుడ్ క్రేజియస్ట్ హీరోయిన్ నేహా శెట్టి 'డీజే టిల్లు'మూవీతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయింది. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ సరసన రాధిక పాత్రలో నటించి మెప్పించింది. ఇప్పటికీ ఈ బ్యూటీని రాధిక అనే అంటారనడంలో ఏమాత్రం సందేహం లేదు.ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.తాజాగా నేహా శెట్టి తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో గ్రీన్ కలర్ డ్రెస్ వేసుకుని అచ్చం మహారాణిలా రెడీ అయింది. అయితే ఆ ఫొటోస్‌ను షేర్ చేస్తూ.. 'మళ్ళీ చూడదగ్గ ఇష్టమైన లుక్' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పిక్స్ కాస్తా నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు నిన్ను ఇలా టిల్లు అన్న చూస్తే నీకు దబిడి దిబిడే అంటూ ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ ముద్దుగుమ్మ పోస్ట్ పై మీరు ఓ లుక్ వేసేయండి.

# మైథలాజికల్ టచ్



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ ఫిల్మ్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. మహేష్ మూవీ కొత్త షెడ్యూల్ ఇటీవలే ఒడిశాలో ప్రారంభమైంది. మహేశ్‌బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్‌లు పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు రాజమౌళి. కాగా ఈ సినిమా షూటింగ్‌లోని ఓ వీడియో బయటికొచ్చింది. ఈ చిత్రానికి మైథలాజికల్ టచ్ ఉందని, రామాయణంలోని కొన్ని ముఖ్య సంఘటనలను స్ఫూర్తిగా తీసుకుని, నేటి ఆధునిక కాలానికి అన్వయించి, ఈ కథను విజయేంద్రప్రసాద్ రెడీ చేశారని సమాచారం. కథలో కాశీ నగరానికి కూడా ప్రాముఖ్యత ఉందట... దాంతో కాశీ నగరాన్ని పోలిన సెట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలనే ఆలోచనలో యూనిట్ ఉందట.

# డేటింగ్ పై క్లారిటీ



కార్తిక్ - శ్రీలీల డేటింగ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. హీరో కార్తిక్ తల్లి వ్యాఖ్యలు వాటికి మరింత బలం చేకూర్చేలా ఉన్నాయి. శ్రీలీలను ఉద్దేశించే ఆమె ఈ వ్యాఖ్యలు చేశారని పలువురు భావిస్తున్నారు. ఇంతకీ ఆమె ఏమన్నదంటే "ఒక మంచి వైద్యురాలు మా ఇంటికి కోడలిగా రావాలని మేమంతా కోరుకుంటున్నాం" అని ఆమె తెలిపారు.నటిగా రాణిస్తోన్న శ్రీలీల.. ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతోన్న విషయం తెలిసిందే. చదువుతోపాటే కెరీర్‌లోనూ కొనసాగడంపై ఎన్నో సందర్భాల్లో ఆమె ఆనందం వ్యక్తంచేశారు. బాలీవుడ్‌లో తన సత్తా చాటుకునేందుకు సిద్ధమయ్యారు శ్రీలీల. ఆ సినిమాలో కార్తిక్ ఆర్యన్ హీరోగా నటించడం విశేషం. ఈ సినిమా చిత్రీకరణ సమయంలోనే కార్తిక్ - శ్రీలీల మధ్య పరిచయం ఏర్పడిందని.. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ కొంతమంది మాట్లాడుతున్నారు.



# బ్యూటిఫుల్ పోస్టర్ రిలీజ్

డైరెక్టర్ మారుతి ప్రజెంటర్‌గా తెరకెక్కిస్తున్న తాజా సినిమా 'బ్యూటీ'. ఇందులో అంకిత్ కొయ్య, విశాఖ ధిమన్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'గీతా సుబ్రమణ్యం, హలో వరల్డ్, భలే ఉన్నాడే' ఫేమ్ వర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కేఆర్ బన్సాల్ నిర్మించిన ఈ చిత్రంలో నరేష్, వాసుకి, నంద గోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీ గౌడ్, ప్రసాద్ బెహరా తదితరులు ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా నుంచి రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ అందరిలోనూ మంచి ఇంపాక్ట్‌ను క్రియేట్ చేశాయి. హోలీ సందర్భంగా కలర్ ఫుల్ పోస్టర్‌ను రిలీజ్ చేస్తూ మరో అప్‌డేట్ ఇచ్చారు. ఈ మేరకు 'మరన్ని రాబోతున్నాయి.. ఫస్ట్ సింగిల్ కమింగ్ సూన్' అంటూ విడుదల చేసిన పోస్టర్‌లో హీరో అండ్ హీరోయిన్ క్యూట్ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు.

## మాట్లాడే 'ఈగ'



నాని హీరోగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన " ఈగ " చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు రాజమౌళి ఈగ లాంటి సినిమానే మలయాళంలో త్వరలో విడుదల కానుంది. వెస్ట్రన్ ఘాట్స్ ప్రొడక్షన్స్, నేని ఎంటర్టైన్మెంట్స్ పతాకం పై శరణ్య, అమర్ రామచంద్రన్ నిర్మాణంలో దిలీష్ కరుణాకరన్ దర్శకత్వంలో మ్యాథ్యు థామస్ హీరోగా " లవ్లీ " చిత్రం తెరకెక్కుతుంది. తాజాగా ఈ లవ్లీ చిత్ర టీజర్ రిలీజ్ చేయడంతో ఇది నెట్టింట వైరల్ గా మారింది. టీజర్ లో రాజమౌళి సినిమాలో అబ్బాయి ఎలా చనిపోతాడో ఇక్కడ ఓ అమ్మాయి చనిపోయాక ఈగలా పుట్టి హీరో దగ్గరికి వచ్చి మాట్లాడుతుంది. మరి ఆ అమ్మాయి ఎవరు? ఈగలా వచ్చి హీరో దగ్గరికి ఎందుకు వచ్చిందనేది తెలియాలంటే సినిమా రిలీజ్ అయ్యే వరకు వేచి చూడాలసిందే.

## పిల్లల కోసమేనా?

కొన్నాళ్ల క్రితం కుంభమేళాలో పాల్గొన్న కత్రినా కైఫ్.. త్రివేణి సంగమంలో పుణ్యస్నానమాచరించింది. భక్తులకు ప్రసాదం కూడా పంచిపెట్టింది. ఇది జరిగిన ఎన్నిరోజులు కాలేదు ఇప్పుడు కర్ణాటకలోని ప్రసిద్ధ కుక్కే సుబ్రహ్మణ్య దేవాలయంలో దర్శనమిచ్చింది. కుటుంబంతో కలిసి సర్ప సంస్కార పూజలో పాల్గొంది. అయితే కుక్కే సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాన్ని దర్శిస్తే సంతాన ప్రాప్తి కూడా కలుగుతుందని చాలామంది నమ్ముతారు. ఇప్పుడు కత్రినా కూడా ఈ దేవాలయాన్ని సందర్శించడం, ప్రత్యేక పూజలు చేయించడం లాంటివి చూస్తుంటే పిల్లల కోసం గుళ్లు, గోపురాలు తిరిగేస్తూ భక్తి మార్గంలోకి వెళ్లిపోయిందా అనిపిస్తుంది.



# ఉమ్మడి జిల్లాలో 'మంచు'టెండ



- ఉదయం పొగ మంచు.. మధ్యాహ్నం దారెత్తిస్తున్న ఎండ
- కొన్నిచోట్ల వడగాడ్పుల ప్రభావం
- వేసవి ప్రారంభంలోనే ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- 40డిగ్రీలపైగానే నమోదు కానున్న ఎండలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయాయి. మార్చి మొదటివారం నుంచే ఎండలు దారెత్తిస్తున్నాయి. ఉదయం ఏడు గంటల వరకు చాలాచోట్ల పొగమంచు కురుస్తుండగా.. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోతోంది. ఎనిమిది గంట తర్వాత నుంచి భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. దీంతో జిల్లా వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ వేడిని తట్టుకోలేక చాలామంది ఉదయం 11 గంటల తర్వాత ఇళ్లు కదలడం లేదు. దీంతో జిల్లాలో ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్లు సాయంత్రం నాలుగు గంటల వరకు బోసిపోతున్నాయి. ఏదేమైనా ఎండల తీవ్రతపై వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడే ఇలా ఉండే ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితేమిటోనని టెన్షన్ పడుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని వివిధ మండలాల్లో వడగాడ్పుల ప్రభావం కనిపిస్తోంది. 38 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. ఈ ఏడాది వేసవి తీవ్రత అధికంగా ఉంటుందని మరోవైపు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేస్తుండడంతో మరింత కలవర పడుతున్నారు. ఏజెన్సీలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల వరకు మంచు కురిసింది. ఆ తర్వాత ఎండ ధాటికి జనం ఇబ్బంది పడ్డారు. మొత్తంగా 39 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదైంది. ఇదిలా ఉండగా వాతావరణ విచిత్ర పరిస్థితులతో అనేక మంది రోగాల బారిన పడుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గుతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యధికులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండ వేడి మరింత పెరగనునున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# విజయవంతంగా కొనసాగుతున్న గిరిజన క్యాంటీన్

## గిరిజన క్యాంటీన్ ప్రారంభించి నేటితో సంవత్సరం

## ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూ గుప్తా



**ఉట్నూర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ ఆధ్వర్యంలో గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన గిరిజన క్యాంటీన్‌ను గత ఏడాది మార్చి 15, 2024 న రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ , ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూ గుప్తా, శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ లతో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఐటిడిఏ పీఓ మాట్లాడుతూ నేటితో ఏడాది పూర్తయిందని అన్నారు. స్థానిక గిరిజన భవన్ లో గిరిజన క్యాంటీన్ లో ప్లేట్ మీల్స్ కేవలం రూ. 5 లకే మధ్యాహ్నం 12.00 గంటల నుండి 2.00 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందనీ, ఈ క్యాంటీన్ ఏర్పాటు చేయడం వలన కొలాం గిరిజనులకు ఉపాధి లభించిందన్నారు. అలాగే చుట్టు ప్రక్కల గల గ్రామాల నుండి వివిధ రకాల పనుల కోసం వచ్చే ప్రజలను దృష్టిలో ఉంచుకొని వారి సౌకర్యార్థం 5/- రూపాయలకే భోజనం అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన గిరిజన క్యాంటీన్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గిరిజన క్యాంటీన్ ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు 77,690 మంది భోజనం చేయడం జరిగిందని, 5 మంది సభ్యులతో ఏర్పడిందన్నారు.

# అనుమతులు లేని పై అంతస్తు కూల్చివేత

**మంచిర్యాల, మార్చి 14 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల పట్టణంలోని ఇక్బాల్ అహ్మద్‌నగర్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన భవనం పై అంతస్తును మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. షహనాజ్ తబస్సుమ్ అనే వ్యక్తి తాను తీసుకున్న అనుమతుల ప్రకారం కాకుండా అదనంగా పై అంతస్తు నిర్మించారు. అంతకుముందే సెల్లార్‌ను నిర్మించారు. సెల్లార్ నిర్మాణ సమయంలో పక్కన ఉన్న డాక్టర్ చంద్రశేఖర్ భవనానికి సంబంధించిన ప్రహరీ పడిపోవడం, దీంతో పాటే కింద తవ్విన సమయంలో ఆ భవనం పిల్లర్లు బయటకు కనిపించడంతో వారు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు.ఆ సమయంలో విచారణకు వచ్చిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా భవనాన్ని నిర్మించారని నిర్ధారణకు వచ్చారు. సంబంధిత భవన యజమానికి నోటీసులు అందజేశారు. నెలలు గడుస్తున్నా సెల్లార్ నిర్మాణం వల్ల డాక్టర్ చంద్రశేఖర్ భవనానికి సంబంధించి ఎలాంటి మరమ్మతులు చేపట్టక పోవడంతో తన భవనం కూలిపోయే ప్రమాదమున్నదని, తనకు న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు అనుమతి లేకుండా నిర్మించిన పై అంతస్తును కూల్చి వేస్తున్నట్లు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ శ్యాంసుందర్ తెలిపారు.



# హంటర్‌కు పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు

## పోలీసుశాఖకు సేవలందించిన జాగిలం అనారోగ్యంతో మృతి

**నిర్మల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లా పోలీస్ శాఖలో విశేష సేవలందించిన 'హంటర్' అనే జాగిలం అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. 'హంటర్' పలు నేర కేసుల్లో కీలక పాత్ర వహించిందని ఎస్పీ తెలిపారు. గురువారం మధ్యానం అనారోగ్యంతో మృతి చెందగా... జిల్లా పోలీసు కార్యాలయంలో 'హంటర్' పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా పోలీసు శాఖకు 'హంటర్' చేసిన సేవలు వెలకట్టలేనివని.. చిరస్మరణీయమైన సేవలు అందించిందని ఎస్పీ కొనియాడారు. జాగిలం మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు పోలీసు అధికారులు, సిబ్బంది మౌనం పాటించారు. బెల్జియం మలినోస్ జాతికి చెందిన జాగిలం 'హంటర్' మార్చ్ 11, 2021న జన్మించింది. రంగారెడ్డి జిల్లాలోని కెనైన్ ట్రైనింగ్ సెంటర్ బిఐటీఏ మొయినాబాద్‌లో 8 నెలల శిక్షణ పూర్తి చేసుకుంది. శిక్షణ సమయంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి, నిర్మల్ జిల్లా పోలీస్ శాఖలో ఫిబ్రవరి 01, 2022 నుంచి నేర విభాగంలో, ప్రముఖుల బందోబస్తులో విధులు నిర్వర్తిస్తు, పలు హత్య, దొంగతనాల కేసులను ఛేదించడంలో 'హంటర్' ప్రతిభ కనబరిచింది. విధి నిర్వహణలో మాత్రమే కాకుండా పలు జాతీయస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొని ప్రతిభ చాటింది. 'హంటర్'కు పోలీసు లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజేష్ మీనా, ఇన్స్పెక్టర్‌లు ప్రేమ్ కుమార్, కృష్ణ, ఆర్ఐలు రాంనిరం జన్, శేఖర్, రమేష్, ఎస్ఐ లింబాద్రి, ఆర్. ఎస్ఐలు, లాల సంరక్షకులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# గూడెంగుట్టలో వైభవంగా పౌర్ణమి జాతర



**దండేపల్లి, మార్చి 14 (ప్రభాత సమాచారం)** మండలంలోని శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో శుక్రవారం వైభవంగా పౌర్ణమి జాతర జరిగింది. ఉదయం నుంచే గూడెంలో వేలాది మంది భక్తు లు తరలివచ్చి భక్తి శ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భ క్తులు ఆల య సమీపంలోని పవిత్ర గోదావరినదిలో పుణ్య స్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూ జలు చేశారు. ఆలయానికి చేరుకొని సత్యదేవుడిని దర్శించుకొని భక్తులు అభిషేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కుటుంబసమేతంగా సత్యనారాయణ స్వామి వ్రతాలను నోముకున్నారు. వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం, స్వామి వారి తీర ధ ప్రసాదాలను అందజేసినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

# నేడు డయల్ యువర్ డీఎం

**ముథోల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** భైంసా ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ హరిప్రసాద్ తెలిపారు. భైంసా పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని 995 9226005 నంబర్ కు ప్రయాణికులు సలహాలు, సూచనలను, సమస్యలను తెలియజేయాలని పేర్కొన్నారు.